క్లుప్తంగా

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలను అందజేస్తున్న ప్రమీలమ్మ

శ్రీకాళహస్తి: దీపావళి పురస్కరించుకుని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి గురువారం అపోలో గ్రూప్స్ అధినేత డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. వీటిని ఆయన తరఫున పాలమండలి మాజీ సభ్యురాలు డాక్టర్ ప్రమీలమ్మ ఆలయ అధికారులకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

శ్రీకాళహస్తి: అమావాస్య పురస్కరించుకుని స్థానిక పీవీరోడ్డులోని అంకాళమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. గత మూడేళ్లుగా ప్రతి అమావాస్య రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, ఉమేష్‌రావు, క్రాంతికుమార్, డాక్టర్ కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రిబాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కరించండి



రాచకండ్రిగ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం: లోవోల్టేజీ కారణంగా గ్రామంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, సమస్య పరిష్కరించాలని పలు మార్లు ఆ శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని భక్తలవల్లం పంచాయతీ రాచకండ్రిగ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు తడ– వరదయ్యపాళెం రోడ్డు మార్గంలోని రాచకండ్రిగ వద్ద నిరసన వ్యక్తం చేసి, వాహన రాకపోకలను అడ్డుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన కొనసాగడంతో రాకపోకలు స్తంభించి వాహనాలు బారులు తీరాయి. అలాగే గ్రామంలో మురుగునీటి కాలువలు, మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీసిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. సమస్యల గురించి సంబంధితశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వేడుకగా దీపావళి ఆస్థానం



కల్యాణ వెంకన్న ఆలయంలో దీపావళి ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం దీపావళి ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. సాయంత్రం అర్చకులు ఆస్థాన మండపంలో పెద్ద శేషవాహనంపై ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేశారు. అనంతరం ఆలయ అధికారులు టీటీడీ తరఫున సమర్పించిన పట్టు వస్త్రాలను ఉత్సవమూర్తులకు అలంకరించారు. శుక్రవారం ఉదయం మూలవర్లకు అభిషేకాలు, సాయంత్రం పద్మావతీ అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారులు పర్యవేక్షించారు. స్థానిక పరాశరేశ్వరస్వామి ఆలయంలో జరిగిన కేదారగౌరీ వ్రతంలో మహిళలు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో గురువారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే నిద్రలేచి తలస్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి, లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

తలకోనలో అమావాస్య పూజలు

భాకరాపేట : తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా అమావాస్య కేదారేశ్వరి నోములు వ్రతం భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ప్రత్యేకంగా అలంకరించిన దేవతామూర్తుల ముందు వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తులు నోములు నోచుకున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో సామాన్యులకు ఇసుక దొరకడం కష్టతరమైంది. మరోవైపు కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ రంగం కుదేలైంది. నియోజకవర్గంలో శ్రీసిటీ పారిశ్రామికవాడకు సైతం ఇసుక ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో అక్కడ పరిశ్రమల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నట్లు సమాచారం. అంతేకాక గృహ నిర్మాణాలు పూర్తిగా ఆగిపోయే పరిస్థితి నెలకొంది.

- ఎమ్మెల్యే సస్పెన్షన్‌కు గురికావడంతో నియోజకవర్గంలో పక్క నేతల పెత్తనం
- నేటికీ తేలని ఇసుక పంచాయతీ
- సత్యవేడులో కొలిక్కిరాని కూటమి నేతల మధ్యస్థం
- శ్రీసిటీ పారిశ్రామికవాడకు తప్పని కష్టాలు
- సామాన్యుల సంగతి సరేసరి
- పనులు లేక భవన నిర్మాణ కూలీల అవస్థలు
- ఎడ్ల బండ్లకే పరిమితమైన నాగలాపురం ఇసుక రీచ్‌లు
- సత్యవేడులో పెత్తనం చెలాయిస్తున్న ఓ పారిశ్రామిక వేత్త

నాగలాపురం మండలం సుబ్బానాయుడుకండ్రిగ రీచ్‌లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న పోలీసులు



ఎందుకీ గతి..

సాక్షి టాస్క్‌ఫోర్స్: సత్యవేడు నియోజకవర్గంలో పక్క నేతల పెత్తనం ఎక్కువైంది. దీంతో స్థానిక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక దొరక్క సగటు సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నియోజకవర్గంలోని నాగలాపురంలో సుబ్బానాయుడుకండ్రిగ వద్ద, పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు వద్ద ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ రీచ్‌ల వద్ద ఎడ్ల బండ్ల తప్ప మిగతా వాహనాలకు ఇసుక రవాణా జరగడం లేదు. దీంతో అటు నిర్మాణ రంగం, ఇటు మేస్త్రీ పనులనే నమ్ముకున్న నిర్మాణ కూలీలకు సైతం పనులు లేక అవస్థలు పడుతున్నారు.

కొలిక్కిరాని ఇసుక పెత్తనం..

నియోజకవర్గంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు కావడంతో అక్కడ పెత్తనం చెలాయించేందుకు కూటమి నేతల మధ్య పోటీ తారాస్థాయికి చేరింది. దీంతో వారి మధ్య సఖ్యత కుదరకపోవడంతో ఇసుక రీచ్‌ల నిర్వహణకు సంబంధించి కచ్చితమైన నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం వెనకడుగు వేస్తోంది. ప్రధానంగా స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సస్పెన్షన్ వేటు పడడంతో ఇక్కడ నాయకత్వ లేమి ఏర్పడింది. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణను నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన శ్రీపతిబాబు పర్యవేక్షిస్తుండగా, ఎన్నికల సమయంలో పరిశీలకుడిగా ఉన్న చంద్రశేఖర్ నాయుడు ఇంకోవైపు అన్నిటా పాల్గొంటున్నారు. మరోవైపు సూళ్లూరుపేటకు చెందిన పారిశ్రామిక వేత్త సత్యవేడులో రుబాబు చేస్తున్నాడు. అధికారులను తన గుప్పెట్లో పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నాడు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

నాగలాపురంలో స్థానికంగా ఎడ్ల బండ్ల ద్వారా రీచ్‌ల నుంచి ఇసుక తరలింపునకు స్థానిక రెవెన్యూ పోలీసు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. అయితే ఈ ఎడ్ల బండ్ల ద్వారా రవాణా అయ్యే ఇసుక ధరలు మాత్రం అందనంత దూరంలో ఉన్నాయి. ఒక్క ఎడ్ల బండి ఇసుక రూ.1500 నుంచి రూ.2 వేల వరకు రేటు పలుకుతోంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో అవసరం అనుకున్న వినియోగదారులు అధిక ధరలకు సైతం ఇసుకను కొనుగోలు చేయక తప్పడం లేదు.

తలనొప్పిగా పారిశ్రామికవేత్త పెత్తనం

నియోజకవర్గానికి ఏమాత్రం సంబంధం లేని సూళ్లూరుపేటకు చెందిన ఓ పారిశ్రామికవేత్త సత్యవేడు నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నాడు. ఆయన నిర్ణయాలు ఇక్కడి అధికారులకు తలనొప్పిగా మారుతున్నాయి. ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు వ్యతిరేకంగా పావులు కదిపేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ శాఖల్లో కీలక అధికారులను తన సామాజిక వర్గానికి చెందిన వారికే పోస్టింగ్‌లు ఇప్పించుకున్నాడు. ఇసుక రీచ్‌ల నిర్వహణ కూడా తనకే అప్పజెబుతుందని, హైకమాండ్ నుంచి త్వరలోనే ఆదేశాలు వస్తాయని, అప్పటి వరకు ఏ ఒక్కరినీ రీచ్‌ల వద్ద ఇసుక ఎత్తనివ్వొద్దని స్థానిక పోలీసులకు హుకుం జారీ చేయడం గమనార్హం. నియోజకవర్గంలోని 7 మండలాల్లో కూడా ఆయన తన సామాజిక వర్గానికే ప్రాధాన్యతనిస్తుండడంతో పార్టీ కోసం పని చేసిన నేతలంతా అసమ్మతి రాగం వినిపిస్తున్నారు.

ఆగిన నిర్మాణాలు

గత రెండు నెలలుగా రీచ్‌ల వద్ద ఇసుక రవాణా ఆగిపోవడంతో నియోజకవర్గ ప్రజలకు ఇసుక కష్టాలు మొదలయ్యాయి. దీంతో ఎక్కడికక్కడ గృహ నిర్మాణాలు ఆగిపోయాయి. అంతేకాక 250 పరిశ్రమలకు పైగా ఉన్న శ్రీసిటీ పారిశ్రామికవాడలో అనేక పరిశ్రమలు నిర్మాణ దశలో ఉన్నాయి. వాటికి సైతం ఇసుక కొరత ఏర్పడింది. పరిశ్రమలకు పెద్దపీట వేస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇసుక అందించడంలో విఫలమవుతోంది. పరిశ్రమలకు సంబంధించిన వారు ఇసుక రవాణాకు ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చుకున్నప్పటికీ అవి చెల్లుబాటు కావని నాగలాపురం పోలీసులు అడ్డు చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను లెక్క చేయకపోవడం గమనార్హం.



సత్యవేడులో ఇసుక కొరత కారణంగా ఆగిన గృహ నిర్మాణాలు

అమలుకాని సీఎం హామీ..

ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా తరలించుకోవచ్చని, అక్కడ ఏ అధికారి అడ్డు చెప్పడానికి వీల్లేదని పదేపదే బహిరంగ సమావేశాల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఊదరగొడుతున్నారు. కానీ సత్యవేడు నియోజకవర్గంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంటోంది. సుబ్బానాయుడుకండ్రిగ, అడవికొడియంబేడు రీచ్‌ల వద్ద ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు వెసులుబాటు ఉన్నప్పటికీ కూటమి నేతల స్వలాభాల కోసం పోలీసుల ద్వారా ఇసుక తరలింపు ట్రాక్టర్లను అడ్డుకుంటున్నారు. పది రోజుల క్రితం అనుమతుల మేరకు శ్రీసిటీ పారిశ్రామికవాడలోని పరిశ్రమల నిర్మాణం కోసం ఇసుక తరలిస్తున్న 11 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. దీంతో ఇక్కడి పోలీసులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

మొరాయించిన సర్వర్



పింఛన్ కోసం వరదయ్యపాళెం సచివాలయం వద్ద వేచి ఉన్న వృద్ధులు

వరదయ్యపాళెం: సర్వర్ పని చేయకపోవడంతో పింఛన్‌దారులు పండుగ నాడు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం 1వ తేదీ కావడంతో లబ్ధిదారులు తెల్లవారుజాము నుంచే పింఛన్ కోసం ఎదురు చూశారు. అయితే ఉదయం 9 గంటల వరకు పనిచేసిన సర్వర్, ఆపై మొరాయించింది. మధ్యాహ్నం 1 గంట వరకు సర్వర్ పనిచేయకపోవడంతో వృద్ధులు, లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరిగారు. సచివాలయాల వద్ద సైతం లబ్ధిదారులకు సమాధానం చెప్పే అధికారులు లేకుండా పోయారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండలవ్యాప్తంగా శుక్రవారం ఉదయం 11 గంటలైనా పింఛన్ అందక వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాల వద్దకు పరుగులు తీశారు. అక్కడ సిబ్బందిని పింఛన్ ఇవ్వాలని ప్రాధేయపడగా, ఉదయం 7.45 గంటల నుంచే సర్వర్ పనిచేయడం లేదని చెప్పారు. అవ్వాతాతలు సచివాలయాల వద్దే పడిగాపులు కాశారు.



నాగలాపురంలో..

ఉపకాలువలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న ఉపకాలువ

వరదయ్యపాళెం: తెలుగుగంగ ఉపకాలువలో పూడిక పేరుకుపోవడంతో నీటి ప్రవాహం సవ్యంగా జరగడం లేదు. మండలంలోని చిన్న పాండూరు మీదుగా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మాంబట్టుకు వెళ్లే తెలుగుగంగ 9బి ఉపకాలువలో పూర్తిగా పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో ప్రధాన కాలువ నుంచి రైతుల అవసరాల కోసం ఉపకాలువకు నీటిని విడుదల చేసిన సమయంలో నీరు సాఫీగా సాగడం లేదు. ఎక్కడికక్కడ పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు అడ్డు తగులుతున్నాయి. 2004–2005లో తెలుగుగంగ ప్రాజెక్టులో భాగంగా కాలువ తవ్వారు. అయితే సంబంధిత తెలుగుగంగ అధికారులు కాలువ దుస్థితిని పట్టించుకోవడం లేదు. ఈ కాలువ పరిధిలో వరదయ్యపాళెం మండలానికి సంబంధించి దాదాపుగా 15 చెరువుల్లో సాగునీరు చేరాల్సి ఉంటుంది. తమకు ఎంతో అవసరమైన ఉపకాలువ పట్ల అధికారులు నిర్లక్ష్యం చూపడమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువలో పూడిక తీసి నీరు సాఫీగా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైల్వే మజ్దూర్ యూనియన్‌లో చేరిక



సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్‌లో చేరిన సీఆర్ఎస్ ఉద్యోగులు

రేణిగుంట: రేణిగుంట క్యారేజ్ రిపేర్ షాప్(సీఆర్ఎస్) దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్‌లో శుక్రవారం 30 మంది రైల్వే కార్మికులు చేరారు. సీఆర్ఎస్‌లోని సీఎఫ్ షాప్‌లో పనిచేస్తున్న రమీ తోమర్ తమ 30మంది అనుచరులతో కలసి యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చేరారు. యూనియన్ చైర్మన్ సదాశివ రెడ్డి, సెక్రటరీ బాబు మాట్లాడారు. మజ్దూర్ యూనియన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి యూనియన్‌లో కార్మికులు చేరడం ఆనందంగా ఉందన్నారు. ముస్ముందు కార్మిక సంక్షేమం కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ ముని కుమార్, హెన్రీ పాల్, మునిరాధయ్య, చంద్రశేఖర్, గాండీవం దిలీప్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాధవమాలలో చెత్తబుట్టలు పంపిణీ

రేణిగుంట: ఏర్పేడు మండలం మాధవమాలలో శుక్రవారం పంచాయతీ ర్యదర్శి పి.సుధాకర్ చెత్తబుట్టలను పంపిణీ చేశారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ చెత్తబుట్టలను ఉపయోగించి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, రవినాయుడు, రామచంద్రారెడ్డి, సయ్యద్ కరీముల్లా పాల్గొన్నారు.

చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న కార్యదర్శి సుధాకర్



తిరుచ్చిపై అమ్మవారు



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అభిషేకసేవ అనంతరం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు కనుల పండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ సమీపంలోని అలంకార మండపంలో తిరుచ్చిపై ఆశీనులైన శ్రీవారి పట్టపురాణి, నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు అమ్మవారికి ధూపదీప నైవేద్యాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

కోదండ రామాలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఈనెలలో పలు విశేష ఉత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా నవంబర్ 2, 9, 16, 23, 30 తేదీల్లో శనివారం సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీసీతారామ లక్ష్మణుల మూలవర్లకు అభిషేకం, సాయంత్రం 5 గంటలకు స్వామి, అమ్మవారిని తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు చేపడతారు. అనంతరం ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. అలాగే 15వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయం 8.30 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఆస్థానం ఉంటుంది. 20వ తేదీన పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ



నరసింహవర్మ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీవీ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా కె.నరసింహవర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీలత ఉద్యోగ విరమణ పొందడంతో ఆమె స్థానంలో ఈయన నియమితులయ్యారు. నరసింహవర్మ ఈ కళాశాల పూర్వవిద్యార్థి కావడం గమనార్హం. ఇదే కళాశాలలో జువాలజీ అధ్యాపకులుగా, వైస్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

గుండెపోటుతో రిటైర్డ్ టీచర్ మృతి



విజయరాజులు (ఫైల్)

రేణిగుంట: గుండెపోటుకు గురై విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండలంలోని గాజులమండ్యం పంచాయతీ జీవాగ్రంలో చోటు చేసుకుంది. వివరాలు..జీవాగ్రంలో నివాసం ఉంటున్న ఏ.విజయరాజులు అలియాస్ విశ్వాసం(62) తిరుపతి పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పని చేసి రిటైర్డ్ అయ్యారు. రాత్రి భోజనానంతరం పడుకున్న కాసేపటికే గుండెపోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భౌతిక కాయానికి పలువురు ఉపాధ్యాయులు, బంధువులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

పీఆర్సీ అమలు చేయాలి

నగరి : టీడీపీ కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, సహ అధ్యక్షుడు మునిరత్నం డిమాండ్ చేశారు. స్వర్ణోత్సవాలు విజయవంతం చేయాలని సంఘం నేతలు స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశమయ్యారు. నగరి, నిండ్ర, విజయపురం మండలాల కౌన్సిల్ నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

● నివాళి



చంద్రయ్య మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు దళితవాడకు చెందిన వైఎస్సార్ సీపీ క్రియాశీలక కార్యకర్త పైపూరు చంద్రయ్య అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించారు. గురువారం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. ఇది తెలుసుకున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఊరందూరు వెళ్లారు. చంద్రయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఆగమోక్తంగా అమావాస్య ఉత్సవం



పురవీధుల్లో విహరిస్తున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అమావాస్య ఉత్సవం ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం చప్పరాలపై అధిష్ఠించి పురవిహారం చేశారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో భక్తులకు ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు 'సమాధుల పండుగ'

పాకాల : స్థానిక క్రైస్తవుల శ్మశానవాటిక సమాధుల పండుగకు సిద్ధమైంది. ఏటా నవంబర్ 2వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఆల్‌సోల్స్ డేని క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రైస్తవులు శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు, గడ్డి వంటి వాటిని తొలగించి శుభ్రం చేశారు. సమాధులకు రంగులు వేశారు. శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేసి నివాళులు అర్పిస్తారు.



వైభవంగా కేదార గౌరీ వ్రతం

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో దీపావళి సందర్భంగా గురువారం ఉదయం శ్రీ మరగదాంబికై అమ్మవారి చెంతన భక్తిశ్రద్ధలతో కేదార గౌరీ వ్రతం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు నేతి దీపా లు వెలిగించి వ్రతం ఆచరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్, సతీశ్ శర్మ, ఆలయ సిబ్బంది వ్రతపూజలను పర్యవేక్షించారు.

గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో..

రేణిగుంట: ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో శుక్రవారం కేదార గౌరీవ్రతం భక్త జన సందడి నడుమ వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సామూహిక వ్రత పూజలు చేశారు. సకల సౌఖ్యాలు సిద్ధించాలని అమ్మవారికి మొక్కారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నప్రసాద వితరణ చేశారు.



మొక్కులు సమర్పిస్తున్న మహిళలు

సత్యవేడులో..

సత్యవేడు: దీపావళి మరుసటి రోజు వచ్చే అమావాస్య రోజున మహిళలు కేదార గౌరీదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యవేడులో శుక్రవారం పలు ఆలయాల్లో కేదార గౌరీవ్రతాన్ని పెద్దఎత్తున ఆచరించారు. అమ్మవారి విగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి పూజకు 21 పసుపుకొమ్ములు, తమలపాకులు, అరటి పండ్లు, నోము దారాలు సమర్పించారు. సత్యవేడు వేణుగోపాలస్వామి ఆలయం, వీరభద్రస్వామి ఆలయం, కాళమనాయుడుపేటలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, విఘ్నేశ్వర స్వామి ఆలయాల్లో కేదార గౌరీ వ్రతం నిర్వహించారు.



రేణిగుంట: పరశురామేశ్వరాలయ ఆవరణలో కేదార గౌరీవ్రతమాచరిస్తున్న మహిళలు



సత్యవేడు: సర్వమంగళదేవి ఆలయంలో కేదార గౌరీ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు



సత్యవేడు: కేదార గౌరీ వ్రత పూజలు చేస్తున్న మహిళలు